

11 నుంచి జిల్లా స్థాయి కళారూపాల పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో కళాఉత్సవ పేరుతో చేపడుతున్న కళారూపాల పోటీలు వచ్చేనెల 11, 12 తేదీల్లో వేణుగోపాలపురంలోని డైట్‌లో జరుగుతాయని డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. శనివారం విద్యాశాఖ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాత్ర సంగీతం, శాస్త్రీయ సంగీతం, గాత్ర సంగీతం బృందం- జానపద/భక్తి/ దేశభక్తి సంగీతం, వాద్య సంగీత, శాస్త్రీయ రాగయుక్త సంగీతం, వాద్య సంగీతం- వ్యక్తిగత - శాస్త్రీయ తాళం, వాద్య సంగీతం - బృందం- ఆర్కెస్ట్రా (జానపద/శాస్త్రీయ) నృత్యం- వ్యక్తిగత- శాస్త్రీయ నృత్యం, ప్రాంతీయజానపద /గిరిజన నృత్యం, నాటకం, ఏకపాత్రాభినయం, మూకాభినయ తదితర అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 9440912863 నెంబరు ను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలల 9,10 తరగతల విద్యార్థులు, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు.

సర్కారు కొలువులు..సాధించారు గురూ


టీచర్ పోస్టుల్లో సత్తాచాటిన అభ్యర్థులు

గ్రామాల్లో సందడి

టీచర్ కావాలన్న ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. రాత్రింబవళ్లు పడిన కఠోర శ్రమ ఫలితమిచ్చింది. 'కలలు కనండి... వాటిని సాకారం చేసుకోండి ' అన్న భారతరత్న ఎపిజె అబ్దుల్ కలామ్ మాటలను అవపోశాన పట్టారేమో ఆ విద్యార్థులు! లక్ష్యానికి అనుగుణంగా అహోరాత్రులూ కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. శుక్రవారం రాత్రి విడుదలైన డిఎస్‌సి ఉపాధ్యాయ ఫలితాల్లో గజపతినగరం మండలం కెంగువ గ్రామానికి చెందిన ఆరుగురు, నెల్లిమర్ల మండలం సారిపల్లికి చెందిన ఆరుగురు అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. రేగిడి మండలంలోని అంబఖండి గ్రామానికి చెందిన దూబ కృష్ణ ఏకంగా డిఎస్‌సిలో మూడు ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించుకున్నాడు. పలు గ్రామాల్లో యువత ఉద్యోగాలు సాధించడంతో సందడి నెలకొంది.

- ప్రజాశక్తి, విలేకర్ల యంత్రాంగం

సారిపల్లిలో సందడి




కె.యోగిత



పి.మౌలిక



ఎం.పైడిరాజు



ఎన్.మురళీధరరావు

నెల్లిమర్ల : మండలం లోని సారిపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. నడిపేన మురళీధర్ రావు, కందుల యోగిత, పుతిక మౌలిక స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, సారిపల్లి హారిక ఎస్‌జిటి, మీసాల పైడిరాజు ఎస్ఎ ఫిజిక్స్, వానపల్లి రామయమ్మ ఎస్ఎ హిందీ పండిట్ పోస్టులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని గ్రామపెద్దలు బి ఆదినారాయణ మాస్టారు, మాజీ సర్పంచ్ పి.వెంకట్రావు. మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు సారిపల్లి బాబురావు, మాజీ ఉపసర్పంచ్ సారిపల్లి గోపాల మూర్తి, ఆల్తి సన్యాసిరావు తదితరులు అభినందించారు.



ఎస్.హారిక



వి.రామయమ్మ

ఒకే ఊరు.. ఆరుగురు ఎంపిక



ఎం.అప్పలనాయుడు



బి.ఈశ్వరరావు



జి.సత్యారావు



ఎల్.కృష్ణవేణి

గజపతినగరం రూరల్ : ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి కెంగువ గ్రామంలో ఆరుగురు అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. కష్టపడితే భవిష్యత్తులో సాధించలేనిది ఏమీ లేదని నిరూపించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. గ్రామానికి చెందిన మజ్జి భార్గవి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ లో జిల్లా మొదటి స్థానం సాధించారు. మిత్తి రెడ్డి అప్పలనాయుడు స్కూల్ అసిస్టెంట్ పిఇటి జిల్లా 4వ ర్యాంక్, బండారు ఈశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఇడబ్ల్యూఎస్ కోటాలో 37వ ర్యాంక్, లోగిస కృష్ణవేణి స్కూల్ అసిస్టెంట్ పిఇటి జిల్లా 22వ ర్యాంకు సాధించారు. గుడివాడ సత్యారావు, మజ్జి సౌభాగ్యలక్ష్మి ఎస్‌జిటి ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. ఒకే గ్రామంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు రావడం మండలంలో ఇదే తొలిసారి. దీంతో వారి కుటుంబాలతో సహా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

ఒక అభ్యర్థి.. ఆరు టీచర్ పోస్టులు

వంగర : మండలంలోని మరువాడ గ్రామానికి చెందిన గుంట ప్రసాద్ డిఎస్‌సి ఫలితాల్లో ఎస్‌సి-బి కేటగిరిలో ఏకంగా ఆరు ఉపాధ్యాయ పోస్టులు సాధించి అందరినీ నివ్వెరపరిచారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్, ఎస్ఎ మ్యాథ్స్, పిజిటి ఫిజికల్ సైన్సు, టిడిజి మేథ్స్ (జోన్1), టిజిటి ఫిజిక్స్ (జోన్1), టిజిటి సైన్సు (జోన్1)లో ఉత్తీర్ణత సాధించారు. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ తనను చదివించారని ప్రసాద్ తెలిపారు. తనకు ఇష్టమైన ఎస్ఎ ఫిజికల్‌సైన్సు ఉద్యోగంలో చేరుతానని తెలిపారు. కొట్టిస గ్రామానికి చెందిన అరసాడ కిరణ్ పిజిటి, టిజిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సాధించారు, ప్రస్తుతం ఆయన మన్యం జిల్లా వీరఘట్టం మండలం యు వెంకంపేట పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్నారు.



గుంట ప్రసాద్

శ్రమించారు..సాధించారు

సంతకవిటి : సంతకవిటి మండలం శ్రీహరినాయుడు పేట గ్రామానికి చెందిన గండ్రేటి ప్రసాదరావు కు స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్‌లో 11వ ర్యాంక్ వచ్చింది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ కావడంతో ప్రసాదరావు కష్టపడి చదివి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 11వ ర్యాంకు సాధించారు. అదే గ్రామానికి చెందిన వావిలపల్లి వెంకటేశ్వరరావు మ్యాథ్స్‌లో 21వ ర్యాంక్ సాధించారు.

సత్తా చాటిన తెర్లాం మండల అభ్యర్థులు

తెర్లాం : మండలంలో పలు గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. బూరిపేటలో బి.తవిటినాయుడు, తొంపల గణేష్, జగన్నాథవలసలో కురమాల రమణ సాయి వాకాడ మధు, వెలగవలసలో అలజంగి శ్రీనివాసరావు, డి.గదబవలసలో జావాన తరుణ్, లోచర్లలో ముగ్గురు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు.

ఎస్ఎ ఇంగ్లీషులో టాపర్ శ్రావణి



బొబ్బిలిరూరల్ : బొబ్బిలి మండలం కునుకువానివలసకు చెందిన మరడాన శ్రావణి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 86 మార్కులు సాధించి విశాఖపట్నం జిల్లా టాపర్‌గా నిలిచారు. జోన్ 1మోడల్ స్కూల్ టిజిటి ఇంగ్లీష్‌లో 78 మార్కులతో 15వ ర్యాంకు సాధించి రెండు పోస్టులకు ఎంపికయ్యారు. గతంలో గ్రామ సచివాలయం ఉద్యోగం వచ్చినా వదులుకొని ఉపాధ్యాయ పోస్టు సాధనపైనే గురిపెట్టి సాధించారు. గృహిణిగా ఇంటి పనులు చేసుకుంటూ దూర విద్య ద్వారా డిగ్రీ, పీజీ చదువుకొని ఎటువంటి కోచింగ్ లేకుండా జిల్లా టాపర్ గా నిలవటంతో తండ్రి లక్ష్మి నాయుడు, భర్త త్రినాథరావు, కుటుంబ సభ్యులు, అభినందనలు తెలిపారు. ఆమె భర్త త్రినాధనాయుడు బాడంగి మండలంలో ఉపాధ్యాయులు గా పనిచేస్తున్నారు

అక్కా చెల్లెళ్లకు పోస్టులు

గజపతినగరం రూరల్ : కెంగువ గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో అక్కాచెల్లెల్లు మజ్జి భార్గవి, మజ్జి సౌభాగ్యలక్ష్మికి టీచర్ ఉద్యోగాలు రావడంతో ఆ కుటుంబంలో పండగ వాతావరణం నెలకొంది. భార్గవి విశాఖలో గత కొంతకాలంగా డిఎస్‌సికి కోచింగ్ తీసుకొని అద్దె గదుల్లో ఉంటూ విజయం సాధించారు. అక్క మజ్జి సౌభాగ్య లక్ష్మి విజయనగరంలో వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ విజయం సొంతం చేసుకున్నారు. తండ్రి ఆర్టీసీ బస్సు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



ఎం.భార్గవి



ఎం.సౌభాగ్యలక్ష్మి

ఒక్కొక్కరికీ మూడేసి ఉద్యోగాలు

రేగిడి మండలంలోని అంబఖండి గ్రామానికి చెందిన దూబ హరికృష్ణ, దేవుదల గ్రామానికి చెందిన కిమిడి కృష్ణ డిఎస్‌సిలో ఏకంగా మూడేసి ఉద్యోగాలు సాధించారు. దూబ హరికృష్ణ 90.5 మార్కులతో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్)గా శ్రీకాకుళం జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించగా, రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంకు సాధించారు. ఫిజికల్ డైరెక్టర్ 85.5 మార్కులతో మొదటి జోన్ లో 3వ ర్యాంకు సాధించారు. పిఇటికి 86 మార్కులతో మొదటి జోన్‌లో తొమ్మిదవ ర్యాంకు సాధించారు.. తల్లిదండ్రులుచక్రధరనాయుడు, తల్లి కళ్యాణితో పాటు కుటుంబ సభ్యులు, సర్పంచ్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కిమిడి కృష్ణ 79.78 మార్కులతో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), పిజిటిలో (69.5) టిజిటి (78.25) ఉద్యోగాలు సాధించారు. కృష్ణ చిన్న వయసులోనే తల్లి అన్నపూర్ణమ్మ మరణించగా తండ్రి ఆదినారాయణ గత ఏడాది మృతి చెందారు. తల్లిదండ్రులు ఇద్దరూ మరణించినా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనే కృషి పట్టుదలతో చదివి సత్తా చాటారు.



దూబ హరికృష్ణ



కిమిడి కృష్ణ



సిబ్బంది, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-డెంకాడ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రజల సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. డెంకాడ మండలం పినతాడివాడలో శనివారం జరిగిన స్వర్ణాంధ-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనకు కలిసికట్టుగా కృషి చేస్తామని సభికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛతే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతీ 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన నివారణా చర్యలపై ఈ నెల అంశంగా తీసుకొని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులు, ఇతర కారకాలద్వారా వచ్చే వ్యాధులు వేర్వేరుగా ఉంటాయని, వాటిని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వ్యక్తిగత, ఇంటి పరిశుభ్రతతోపాటు సామాజిక పరిశుభ్రత కూడా చాలా అవసరమని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతీ ఒక్కరి బాధ్యతని చెప్పారు. ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేసి స్వచ్ఛ గ్రామాలను రూపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. ఫాగింగ్ మిషన్లను వినియోగిం చడంపై ప్రతీ గ్రామ పంచాయితీలో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ మల్లికార్జునరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి,ఎంపిపి బి.వాసుదేవరావు, ఎంపిడిఒ వై.భవాని, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ రామకృష్ణ, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, ఎంపిటిసి అచ్చెన్నాయుడు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశాల్లో వేధింపులకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్, కోట

పని ప్రదేశాల్లో మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్సు హాలులో న్యాయశాఖ సిబ్బందికి లింగ వివక్షత, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ నిషేధం, నిరోధక చట్టం, పోక్సో చట్టం అమల్లో వచ్చాయని తెలిపారు. ఈ చట్ట ప్రకారం ఎవరైనా పని ప్రదేశంలో మహిళలపై లైంగిక పరమైన వేధింపులకు గురిచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు. ఇంట్లో పని చేసే మహిళలకు కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.విజయ కళ్యాణి, ఎస్‌సి,ఎస్‌టికోర్టు జడ్జి బి.అప్పలస్వామి, మహిళా కోర్టు జ్జి ఎం.పద్మావతి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురిలో అవగాహన సదస్సు

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యాన ధర్మపురంలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నివారణ చట్టం, పిసిఆర్, పిఒఎ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణ కుమార్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దయ్యే వరకూ పోరాటం

ప్రజాశకి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ఆదాని స్మార్ట్ మీటర్లు రద్దయ్యేవరకు పోరాడతామని సిపిఎం నగర కార్యాదర్శి రెడ్డి శంకర్రావు పిలుపు నిచ్చారు. శనివారం ఎల్ బి జి నగర్ 17వ వార్షికోత్సవం సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేసారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్డి శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పి మాట తప్పి ప్రజలను మోసగించారని, స్మార్ట్‌మీటర్లు బద్దలు కొట్టండని చెప్పిన లోకేష్ నేడు ఇంటింటికే మీటర్లు బిగించడం మోసం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇళ్లకు మీటర్లు బిగించేందుకు వస్తే అడ్డుకొని తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. నగర కమిటీ సభ్యులు బి.రమణ, రాముడు, స్థానిక నాయకులు పుణ్యవతి పాల్గొన్నారు.



ఎల్‌బిజి నగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నాయకులు, కాలనీ వాసులు

విద్యారంగ సమస్యలపై 25న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 25న ఛలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా విద్యా రంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా ఉన్నాయని అన్నారు. ప్రధానంగా జిల్లాలో 5 ఏళ్ల క్రితం ఏర్పడిన విజయనగరం, రాజాం , గజపతినగరం డిగ్రీ కళాశాలలు దిక్కు మొక్కు లేకుండా పోయాయని అన్నారు. తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్ కు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న 6500 కోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసి డిగ్రీ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారే తల్లికి వందనం నిధులు 523 కోట్లు ప్రభుత్వం పెండింగ్ పెట్టిందని తెలిపారంటే విద్యా శాఖ పరిస్తితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. పాదయాత్ర లో జీఓ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తామని నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జెఎన్‌టియుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ కి సొంతభవనం లేక గత 7 ఏళ్లుగా అద్దె భవనాల్లో నడుస్తుందని, విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతుందని విమర్శించారు. తక్షణమే నిర్మాణాలను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ల సాధనకు జరుగుతున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, శిరీష, జిల్లా సహాయ కార్యదర్శులు పి.రమేష్, కె.రాజు , వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సమన్వయం

పోక్సో కేసుల్లో శిక్షలు పడడంలో జిల్లా ప్రథమ స్థానం : విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టీ

ప్రజాశక్తి - కంటోన్మెంట్

నేరాల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి, ప్రజలకు ఉత్తమంగా సేవలు అందించాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టీ సూచించారు. పోక్సో కేసుల్లో నిందితులను శిక్షలు పడడంలో రాష్ట్రంలోనే విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని అభినందించారు. పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో అర్ధసంవత్సర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ఇటీవల నమోదవుతున్న ఎన్‌డిపిఎస్ కేసుల్లో పలువురు విద్యార్థులు నిందితులుగా అరెస్టు అవుతున్నారన్నారు. ఎక్కువ కేసుల్లో విద్యార్థులే గంజాయి వినియోగదారులుగా, సరఫరా చేసే వ్యక్తులుగా మారుతున్నారన్నారు. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి, డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపి, అవసరమైన వైద్యాన్ని అందించాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడుల్లోను, పోక్సో కేసుల్లో న్యాయ స్థానాల్లో శిక్షలు పడడంలో రాష్ట్రంలోనే విజయనగరం ప్రథమ స్థానంలో నిలిచిందని, అందుకు కృషి చేసిన జ్యుడిషియల్ అధికారులు, పోలీసు అధికారులను డిఐజి అభినందించారు. మహిళలు బస చేసే ప్రైవేటు, ప్రభుత్వ హాస్టల్స్ లోను భద్రత ఏర్పాట్లును అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. సైబరు, సోషల్ మీడియా వేధింపులను నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనధికారంగా ఆయుధాలు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని, శివారు గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించాలని, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో జాయింట్ ఆపరేషన్స్ చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా జడ్జి ఎం.బబిత మాట్లాడుతూ మహిళలు బస చేసే హాస్టల్స్, హోమ్‌లలో భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. న్యాయ స్థానాల్లో ప్రాసిక్యూషను వేగవంతంగా పూర్తయ్యేలా చూసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని జిల్లా కలెక్టరును కోరారు. లోక్ అదాలత్‌ల్లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం తక్షణమే మంజూరయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకొని, ప్రమాదాల నియంత్రణకు పోలీసుశాఖకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని, జాతీయ రహదారిపై 66 సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రూ.5లక్షలను మంజూరు చేసామని తెలిపారు. ప్రతీ పోలీసు స్టేషనుకు ఒక డ్రోన్ ను మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, త్వరలో జిల్లా పోలీసుశాఖకు 34 డ్రోన్స్ అందిస్తామన్నారు. ఎస్‌పి వకుల్‌జిందల్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలను వివరించారు. మహిళల రక్షణ ప్రాధాన్యత కల్పిస్తున్నామని, 25 పోక్సో కేసుల్లోను, మరో 18 కేసుల్లో నిందితులు న్యాయస్థానాల్లో శిక్షింపబడేలా చర్యలు చేపట్టామన్నారు. గంజాయి కేసుల్లో ఫైనాన్సియల్ ఇన్వెస్టిగేషను సమర్థవంతంగా పూర్తి చేసిన ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి, బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావులకు డిఐజి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిటిసి డి.మణికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు, డిఎఫ్ఒ ఆర్. కొండలరావు, డిఎంహెచ్ఒ జీవన్ రాణి, డిఇఒ కెవి రమణ, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనరు కె.అప్పలరాజు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనంతరం 2వ పట్టణ పోలీసు స్టేషన్‌ను డిఐజి సందర్శించారు. పోలీసు స్టేషన్ లోని సి.సి.టి.వి. కమాండ్ కంట్రోల్ రూమును సందర్శించి సి.సి.టి.విల పనితీరును పరిశీలించి సిఐ శ్రీనివాసరావుకు సూచనలు చేసారు. పోలీసు స్టేషన్లో పని చేస్తున్న కోర్ట్ కానిస్టేబుళ్లతో మాట్లాడి కోర్టులో శిక్షలు పడటానికి అనుసరించాల్సిన పద్దతుల గురించి వివరించారు. డిఐజి వెంట ఎస్‌పి వకుల్‌జిందాల్, డిఎస్‌పి శ్రీనివాసరావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్ జట్టీ

రైతులు, వికలాంగుల్లో ఆందోళన



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని రైతులు, వికలాంగులు, విద్యుత్ వినియోగదారుల్లో ఆందోళన పెరుగుతోంది. ఓవైపు భారాలు, మరోవైపు సంక్షేమం కోత పెడితే ఎలా బతుకుతామని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే యూరియా కొరతపై రైతులు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతుండగా, తమకు పింఛన్లు తొలగించడం అన్యాయమంటూ రోడ్లెక్కేందుకు వికలాంగులు సిద్ధమౌతున్నారు. రకరకాల సాకులతో ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలూ తమకు పెనుభారంగా పరిణమించాయంటూ విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అనర్హత పేరిట వికలాంగుల పింఛన్ల తొలగింపునకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో 7వేల మంది పింఛన్లకు అనర్హులంటూ నోటీసులు జారీ చేశారు. ఇందుకోసం సదరం సర్టిఫికెట్ల పరిశీలన పేరిట 8నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిప్పించారు. వికలాంగత్వం 40శాతం కన్నా తక్కువ ఉందంటూ ఆయా నోటీసుల్లో పేర్కొన్నారు. ఇందులో చాలా మంది పదేళ్లకుపైగా పింఛన్లు తీసుకుంటున్నవారూ ఉన్నారు. పోలియోతో అంగవైకల్యానికి గురైనవారు కూడా ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలన్న దృష్టితో వైద్యుల మెడపై కత్తిపట్టిందని, వైద్యులు తమ వైకల్యాన్ని తగ్గిస్తూ సరిఫికెట్లు జారీచేశారని చాలా మంది వికలాంగుల వాదన. ప్రభుత్వమూ, ఇందులో భాగంగావున్న వైద్యులు తమ కడుపుకొడుతున్నారని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తొలగింపు నోటీసులు అందుకున్నవారికి వచ్చేనెల నుంచి ఫించన్లు అందేందుకు అవకాశం లేదు. దీంతో, ఇప్పటికే వికలాంగులు కొన్నిచోట్ల నిరసన తెలుపుతున్నారు. 1వ తేదీ తరువాత వీరంతా రోడ్లపైకి వచ్చే అవకాశం లేకపోలేదు. వికలాంగులకే అన్యాయం చేసిన ప్రభుత్వం తమ వరకూ రాకపోతుందా? అంటూ వృద్ధులు, దీర్ఘకాలిక రోగాల వల్ల పింఛన్లు తీసుకుంటున్న రోగులు, ఇతర కేటగిరీలవారు ఆందోళన చెందుతున్నారు. వీరంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారితే అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మరోవైపు ఈ ఏడాది వాతావరణం అనుకూలించినప్పటికీ ప్రభుత్వం నుంచి అందుకు తగ్గ సహకారం లేదు. పంట రుణాలు ఎలాగూ లక్ష్యానికి అనుగుణంగా ఇవ్వలేదు. చాలా మందికి అన్నదాత సుఖీభవ పథకం అమలు కాలేదు. అప్పుసప్పోచేసి మదుపు పెట్టుకుందామనుకుంటే యూరియా అందుబాటులో లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం.... ప్రస్తుతం వివిధ పంటల సీజనల్ కండీషన్ బట్టి జిల్లా వ్యాప్తంగా 32,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఆగస్టు ప్రారంభం నాటికి వచ్చింది కేవలం 24,360 మెట్రిక్ టన్నులు మాత్రమే. దీన్నిబట్టి 8,240 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్టుగా స్పష్టమౌతోంది. ఈ సంగతి అటుంచితే... జిల్లాకు వచ్చిన యూరియాలో 50శాతం అంటే దాదాపు 12,180 మెట్రిక్ టన్నుల వరకు ప్రైవేటు డీలర్లకు వెళ్లింది. మిగిలిన 50శాతం మార్క్‌ఫెడ్ ద్వారా 30శాతం రైతు సేవా కేంద్రాలకు, 20శాతం పిఎసిఎస్‌లకు తరలించి రైతులకు పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లలో స్థానిక రాజకీయ నాయకుల పెత్తనం పెచ్చుమీరడంతో తమ వరకు రావడం లేదని రైతుల వాదన. మొత్తంగా యూరియా లోటును ఆసరాగా చేసుకున్న ప్రైవేటు వ్యాపారులు పురుగుల మందులు కొంటేనే యూరియా విక్రయిస్తామంటూ మెలికపెట్టడంతో కొనలేక, వ్యవసాయం మానుకోలేక సతమతమౌతున్నామని వాపోతున్నారు. చివరకు అప్పులు చేసి మరీ అవసరం లేని పురుగుల మందులను కూడా కొనుక్కోవాల్సివస్తోందని రైతుల టాక్. మరోవైపు కొరత నేపథ్యంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విత్తనాల పంపిణీ, నీటి విడుదల సమయంలో ఫొటోలకు ఫోజులు ఇస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పుడు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరంకోట

రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన శనివారం పలువురు రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ బొండపల్లి మండల విఆర్ఒ, రెవెన్యూ అధికారులు మ్యుటేషన్, జాయింట్ ఎల్‌పిఎం తదితర సమస్యలు పరిష్కారానికి సెంటుకి 300చొప్పున 40మంది రైతుల వద్ద తీసుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మరువాడ కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీను,అప్పలరాజు, మాధవ పాల్గొన్నారు.

రూ.400కే బిఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త ట్రిపుల్ ప్లే ఆఫర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త ట్రిపుల్ ప్లే ప్లాన్‌ను ప్రకటించింది. నెలకు కేవలం రూ.400 చెల్లించడం ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్‌తో పాటు 400 పైగా టీవీ చానల్స్, 9 ఓటిటి చానల్స్, అపరిమిత ఫోన్ కాల్స్ సేవలను ప్రవేశపెట్టింది. బిఎస్‌ఎన్‌ఎల్ ఎఫ్‌టి టిహెచ్ వాడుతున్న వినియోగదారులు కూడా 140 రూపాయలు చెల్లించి ఈ టివి, ఓటిటి చానల్స్ పొందవచ్చునని బిఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లాన్ కావాల్సిన వారు దగ్గరలోని బిఎస్‌ఎన్‌ఎల్ సేవా కేంద్రాన్ని లేదా బి ఎస్‌ఎన్‌ఎల్ టెలికం ఇన్ఫ్రా పార్టనర్సును సంప్రదించాలని తెలిపారు

పారాది కాజ్‌వేపై స్తంభించిన ట్రాఫిక్


రోడ్డు మధ్యలో నిలిచిపోయిన వాహనాలు

బొబ్బిలి: పారాది కాజ్‌వే వద్ద శనివారం ట్రాఫిక్ స్తంభించింది. కాజ్‌వే పై నుంచి భారీ వాహనాలు రాకపోకలు చేయడంతో భారీ ట్యాంకర్ మరమ్మతులకు గురై రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో రోడ్డుకు ఇరవైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఆదేశాలు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు మధ్యలో ఆగిపోయిన లారీని పక్కకు నెట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి : శంబంగి

బొబ్బిలి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని 18వ వార్డులో శనివారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సావు మురళి, నాయకులు పాల్గొన్నారు.

వర్క్‌షాపు వ్యాపారవేత్తలకు ప్లాట్‌ఫాం

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

కొత్తగా వ్యాపారవేత్తలుగా ఎదగదలచిన వారికీ వర్క్‌షాప్ ఒక ప్లాట్‌ఫామ్‌లా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి న్నారు. భోగాపురం ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉద్యం రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న, చిన్న పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలు, రిజిస్ట్రేషన్లు, సబ్సిడీల వంటి అంశాలపై ఈ వర్క్‌షాప్ ద్వారా స్పష్టత కలుగుతుందన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా స్థానిక యువతలో స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ముందడుగు వేసి పరిశ్రమలు స్థాపించి ప్రగతి దిశగా నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు, యువత పాల్గొన్నారు.

యూరియా పంపిణీ తనిఖీ

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేస్తున్న యూరియాను మండల వ్యవసాయ అధికారి టి.సంగీత తహశీల్దార్ ఎం.రాజారావు, పోలీస్ శాఖ హెచ్‌సి శంకర్రావు జాయింట్‌గా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు కొన్ని సూచనలు చేశారు. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వాలని చెప్పారు. ఇచ్చేటప్పుడు రైతుకు సంబంధించిన వన్‌బి, ఆధార్ నెంబరు తీసుకొని ఇవ్వాలని తెలిపారు. పంపిణీకి సంబంధించిన రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకులు శాలిని రైతులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్ రెడ్డికి నివాళి

నెల్లిమర్ల: సిపిఐ పోరాట యోధుడు సురవరం సుధాకర్ రెడ్డికి సిపిఐ నాయకులు మొయిద పాపారావు నివాళులర్పించారు. శనివారం కొండగుంపాంలో దివంగత సిపిఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి మృతికి ఆ పార్టీ నాయకులు మొయిద పాపారావు నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సుధాకర్ రెడ్డి కార్మిక, కర్షక, శ్రామికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. సుధాకర్ రెడ్డి మృతి వామ పక్ష ఉద్యమానికి తీరని లోటని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.పైడినాయుడు, పి.సూరి, రమణమ్మ, రామునాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యను బలోపేతం చేయాలి

గంట్యాడ: ఫ్రీ స్కూల్ విద్యను బలోపేతం చేయాలని సిడిపిఒ ఉమా భారతి అన్నారు. బుడతనాపల్లి, పెనసాం సెక్టార్లలో శనివారం ఎసిసిఎ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలు, కథలు ద్వారా విద్యను నేర్పిస్తున్నామన్నారు. పిల్లలకు మంచి అలవాట్లు, వేడివేడి భోజనాలు పెడుతున్నామన్నారు. ఆరోగ్యం, ఆహారం, మంచి అలవాట్లతో పాటు విద్య నైపుణ్యత, తెలివితేటలు అంగన్‌వాడీ ద్వారా పిల్లల్లో వస్తాయన్నారు. 3 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఫ్రీ స్కూల్ విద్యను అందించాలని పిల్లల తల్లులకు సూచించారు. పిపి1, పిపి2 ఇంటింట విద్య ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్రీ స్కూల్ పిల్లల హాజరు నమోదును పెంచాలన్నారు. అనంతరం ఫ్రీ స్కూల్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పైడిరాజు, చిన్ని తల్లులు పాల్గొన్నారు.

కొత్త బార్లకు దరఖాస్తులు ఆహ్వానం

బొబ్బిలి: కొత్త బారు పాలసీ ప్రకారం బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో నాలుగు కొత్త బార్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారు. ఈ నెల 18 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. ఒక ఏడాదికి లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు అని ఒక వ్యక్తి ఎన్ని అప్లికేషన్లు అయినా వేయవచ్చునని లాటరీ ఈ నెల 28న విజయ నగరంలో నిర్వహిస్తారని చెప్పారు. లాటరీలో సెలెక్ట్ అయిన వ్యక్తి బారును మూడు సంవత్సరాలు పాటు నిర్వహించుకోవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

ఎరువులను ఎంఆర్‌పికే అమ్మాలి

సంతకవిటి: ఎరువులను ఎంఆర్‌పి ధరలకే రైతులకు విక్రయించాలని తహశీల్దార్ బి.సుదర్శనరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల అమ్మకాల్లో డీలర్లు అక్రమాలకు పాల్పడితే 6ఎ కేసులు నమోదు చేస్తామన్నారు. దుకాణంలోని 24 టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు.

31న ప్రజాసంకల్ప వేదిక మహాసభ

బొబ్బిలి: ఈనెల 31వ తేదీన విశాఖపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజా సంకల్ప వేదిక ఉత్తరాంధ్ర జిల్లాల మహాసభలు జరగనున్నాయని విజయనగరం జిల్లా ప్రజా సంకల్ప వేదిక ఇంచార్జ్, మానవ హక్కుల అధ్యక్షులు గోనా మానస తెలిపారు. శనివారం ఆమె మండల కేంద్రంలో జిల్లా హ్యూమన్ రైట్స్ విభాగం సభ్యులతో కలిసి విలేకర్ల సమావేశం మాట్లాడారు. ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షులు మదిరే రంగసాయి రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనున్నదని, ఉత్తరాంధ్ర జిల్లాలలోని ప్రజా సంకల్ప వేదికకు సంబంధించి అన్ని విభాగాల సభ్యులు ఈ సమావేశానికి హాజరై, జయప్రదం చేసి ప్రజా సంకల్ప వేదిక ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళాలని కోరారు.

ముగిసిన ఎటిఎల్ శిక్షణ

విజయనగరం టౌన్ : యునిసెఫ్, విజ్ఞాన ఆశ్రమం పూణే, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన జెఎన్‌టియువిలో మూడు రోజుల అటల్ మెంటర్ షిప్ ప్రోగ్రాం శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. మూడవరోజు మొదటి సెషన్ లో డిజిటల్ పియానో మరియు పిక్టో బ్లాక్ ఉపయోగించి గేమ్ డిజైన్ చేశారు. విజ్ఞానాశ్రమం పూణే మేనేజర్ కిషోర్ గైక్వాడ్ విద్యార్థులకు ఉపయోగపడే వెబ్‌సైట్, టూల్స్ గురించి వివరించారు. ముగింపు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి జె నాగరాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల పురోగతికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పూణె విజ్ఞానాశ్రమం మేనేజర్ కిషోర్ గైక్వాడ్ , ఎటిఎల్ రాష్ట్ర పరిశీలకులు వెంకటేష్, జిల్లాసైన్సు అధికారి టి.రాజేష్, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్

పట్టణంలోని రంజిని థియేటర్ ఎదురుగా ఉన్న ఎల్లారమ్మ టెంపుల్ సమీపంలో భోగాపురం గ్రామానికి చెందిన భావిశెట్టి నరసింగరావు (49)శుక్రవారం పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్‌ఎంపి డాక్టర్గఆ పనిచేస్తున్న ఆయన గత కొన్ని ఏళ్లుగా అనారోగ్యంతో మానసికంగా బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి పట్టణంలోని ఎల్లారమ్మ గుడి సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన శనివారం మృతి చెందాడు. మృతుని భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మెంటాడ మండలంలో దళితులు, గిరిజనులు సాగు చేస్తున్న పోడు, అటవీ భూములకు సాగు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల జి.శ్రీనివాస్, రాకోటి రాములు డిమాండ్ చేశారు. సాగు పట్టాలివ్వాలని కోరుతూ శనివారం వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా రిజర్వ్ ఫారెస్ట్ భూములు సాగు చేసుకుంటున్నా గిరిజనులకు పట్టాలు ఇప్పటికీ ఇవ్వలేదని, గిరిజనులు సాగు చేస్తున్న ఫారెస్ట్ భూమిని జిరాయితీగా చూపించి బండారు సంజీవరావు రిజిస్ట్రేషన్ చేసుకుని పట్టాదారు పాసు బుక్ పొందారని చెప్పారు. గిరిజనులు సాగు చేస్తున్న భూమి రిజర్వ్ ఫారెస్ట్ భూమి అని రెవెన్యూ అధికారులు నిర్ధారణ చేసినా ఎందుకు రిజిస్ట్రేషన్ రద్దు చేసి పేదలకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆగూరు రెవెన్యూలో సుమారు 57 ఎకరాల భూమి రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని అది గిరిజన గ్రామాలైన సంఘం గుడ్డివలస, ఎర్రగడ్డవలస, పనుకువాణివలస, సెడగంవలస గ్రామాల 80 కుటుంబాలు సాగు చేసి జీడి తోటలు వేసుకుని జీవనం సాగు చేస్తూ ఫల సాయం కూడా పొందుతున్నాయన్నారు. అనేక సంవత్సరాలుగా పట్టాలు కావాలని గిరిజనులు తిరుగుతున్నా ఫలితం లేదన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా హక్కు పొందలేకపోతున్నారన్నారు. తక్షణమే నకిలీ పత్రాలు రద్దు చేయాలని ఆర్‌డిఒను కోరారు. మెంటాడ మండలంలో సుమారుగా 1000 కుటుంబాల సాగు చేస్తున్న భూములను అధికారులు సర్వే చేసారని, దీనిలో దళిత గిరిజన పేదలు ఉన్నారన్నారు. తక్షణమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ కమిటీ వేసి పట్టాలివ్వాలని పాలకులను కోరారు. పేదలు ఐక్యంగా పోరాడుతూ భూములు కాపాడుకోవాలని, భూమిపై హక్కులు సాధించాలన్నారు. సమస్యలు పరిష్కారం కానీ ఎడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలకు సంసిద్ధం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలం, సిఐటియు నాయకులు బి.శ్రీను, మెంటాడ మండల గిరిజన సంఘం నాయకులు పెదరాము, అప్పారావు, సన్యాసమ్మ, గౌరమ్మ, వీరమ్మ, గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, గిరిజనులు

వికలాంగులకు అండగా వైసిపి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

వికలాంగులకు వైసిపి అండగా ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని, వారికి అండగా ఉంటామని వైసిపి ప్రకటిస్తే నోటీసులు వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారన్నారు. పరిపాలనపై దృష్టి పెట్టకుండా వికలాంగులు పింఛన్ల రద్దుపై దృష్టి పెట్టడం అన్యాయమన్నారు. ఉమ్మడి జిల్లాలో 10వేల పింఛన్లు రద్దుకు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. నూతన పింఛన్లు మంజూరు చేయకుండా పాత పింఛన్లు రద్దు చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో 66 లక్షలు పింఛన్లు ఉంటే 62 లక్షలకు తగ్గించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పింఛన్లు రద్దుకు నోటీసులు జారీ చేసి మరల దరఖాస్తు చేసుకోవాలని వికలాంగులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. రైతులకు ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదన్నారు. రోడ్లు బాగు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటు పడిందని ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని, అర్హులందరికీ తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయనతో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇంటి గోపాలరావు, వైసిపి సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, తదితరులున్నారు.

మండలానికి 20,028 స్మార్ట్ కార్డులు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలానికి 20028 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని తహశీల్దార్ నీటకంఠేశ్వరరెడ్డి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో శనివారం సిఎస్‌డిటి మూర్తి ఆధ్వర్యంలో డీలర్లకు స్మార్ట్ రేషన్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పాత రైస్ కార్డులతో పాటు జూన్ 30వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకున్న కొత్తవాటికి కలిపి స్మార్ట్ కార్డులు వచ్చాయన్నారు. వీటిని ప్రస్తుతం డీలర్లకు అందించామని వాటిని డీలర్లు ఈ నెల 25న సచివాలయం సిబ్బందికి అందించి వారి ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.


డీలర్‌కు కార్డులు అందిస్తున్న తహశీల్దార్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిద్ధం

తెర్లాం: స్మార్ట్ రేషన్ కార్డుల పంపణీకి సిద్ధం చేస్తున్నామని తహశీల్దార్ హేమంత కుమార్ అన్నారు. ఆయన కార్యాలయంలో శనివారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 58 డిపోల ద్వారా సోమవారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేయాలన్నారు. కార్డు హోల్డర్, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా సరే బయోమెట్రిక్ వేసి కార్డు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సచివాలయ సెక్రటరీ, మహిళా పోలీసులు, డీలర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - చీపురుపల్లి

విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా చీపురుపల్లిలోని బ్రహ్మకుమారిస్ సేవా కేంద్రంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. శిబిరాన్ని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇంచార్జ్ రాజయోగిని బికే అన్నపూర్ణ దీదీజి ప్రారంభించారు. చీపురుపల్లి పరిసర గ్రామాల్లో ఉన్న బ్రహ్మకుమారీలు, యువత ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 113 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ చీపురుపల్లి కేంద్రం ఇన్చార్జి బికే శాంతి, బ్రహ్మకుమారీలు యువత పాల్గొన్నారు.

గరివిడి: విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా స్థానిక బ్రహ్మకుమారీస్ కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని బి.లతక్కయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా రాజయోగిని జిల్లా ఇంచార్జి బికె అన్నపూర్ణ పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరంలో 50 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మీసాల విశ్వేశ్వరరావు, జెడ్‌పిటిసి వాకాడ శ్రీను, టిడిపి మండల అధ్యక్షులు సారేపాక సురేష్‌బాబు, అవంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాలభాస్కరరావు, గోదావరి దేవి పాఠశాల ప్రిన్సిపాల్ బి.రవి, కొండపాలెం సర్పంచ్ పి.కుమార్, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

నెల్లిమర్ల: గణేష్ ఉత్సవాల మండపాలు, పందిళ్ళ ఏర్పాటుకు, విగ్రహానికి అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదన్నారు. మండల పరిధిలో ప్రతి ఒక్కరూ వినాయక ఉత్సవాలను, నవరాత్రులను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ, అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా పోలీస్‌లకు సహకరిస్తూ జరుపుకోవాలని సూచించారు. ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంతో https://ganeshutsav.net క్లిక్ చేసి, నిర్ధేశించిన అనుమతులు పొందాలన్నారు.

25న ఫెన్సింగ్ జట్టుఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 30న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వెస్ట్ బెర్రి స్కూల్‌లో 11 వ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-17 బాలుర, బాలికల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా టీమ్‌ఎంపిక సోమవారం ఉదయం 9గంటల నుంచి విజ్జీస్టేడియంలో జరుగుతాయని రాష్ట్ర కార్యదర్శి జిఎస్‌వి కృష్ణమోహన్ తెలిపారు. జిల్లాకు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు 17 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు , బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8374737707 నెంబరును సంప్రదించాలని తెలిపారు. .

ఓటరు జాబితాను పరిశీలించాలి

విజయనగరం టౌన్ : త్వరలో జరగనున్న 34వ డివిజన్ ఉప ఎన్నికకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా పరిశీలించే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ఆదేశించారు. శుక్రవారం కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉప ఎన్నికకు అవసరమైన సాఫ్ట్ వేర్ లో నిక్షిప్తమైన తాజా ఓటరు జాబితాను ప్రకటించే నిమిత్తం ముందస్తు చర్యలలో భాగంగా డివిజన్‌లో ప్రతి ఓటరు యొక్క వివరాలను తెలుసుకొని ఓటరు జాబితా ప్రకారం ఓటర్లు ఉన్నారా లేదా అన్న విషయాన్ని తనిఖీ చేయాల్సి ఉందని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టిపిఒ అప్పల రాజు, టిపిఎస్ అనిత, ప్లానింగ్ సెక్రటరీలు, బూత్ లెవెల్ అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలు

కంటోన్మెంట్ : అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా హెచ్ఐవి/ఎయిడ్స్‌పై ప్రచారంలో భాగంగా వాల్‌పోస్టర్‌లను, కరపత్రాలను డిఎంహెచ్‌ఒ డాక్టర్ జీవనరాణి శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రెండు నెలల పాటు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా యువతపై దృష్టి సారించి, హెచ్ఐవి, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్లు, మాదకద్రవ్య దుర్వినియోగంపై ప్రచారం చేపడతామని తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

విజయనగరం టౌన్ : స్థానిక ఎంఆర్ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో బాలాజీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన మొదటి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులకు రూ.15వేలు విలువ గల యూనిఫామ్‌లు ఉచితముగా శనివారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్ధన నాయుడు అధ్యక్షత వహించి బాలాజీ వాకర్స్ క్లబ్ సేవలను కొనియాడా రు. బాలాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు నాగలక్ష్మి విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.క్లబ్ కార్యదర్శి కె. శ్రీదేవి, క్లబ్ డిప్యూటీ గవర్నర్ సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా నిర్మించిన రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఖాళీ షాపులకు, ఓల్డ్ ఐడిఎస్‌ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ఖాళీ షాపులు, జనతా బజారులోగల ఖాళీ షాపులు బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ కిల్లానఅప్పలరాజు తెలిపారు.ఈనెల 5న నిర్వహించిన వేలం పాటకు ఎవరూ హాజరు కానందున ఈనెల 26న ఉదయం 10గంటలకు తిరిగి నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు తగు పత్రాలు, బ్యాంకు గ్యారంటీ, డిపాజిట్ సహ హాజరు కావాలని తెలిపారు

చీకటిలో సంతకవిటి ప్రధాన కూడలి

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కూడలి చీకటిమయంగా మారింది. వారం రోజులు నుండి విద్యుత్ లైట్ వెలగక పోవడంతో పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో ప్రధాన కూడలి వద్ద అభయాంజనేయ స్వామి ఆలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఆ ప్రాంతంలో లైట్ వెలగకపోవడంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజారోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యతని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో ఆరోగ్య పరిరక్షణ అనే అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్దనున్న గాంధీ విగ్రహం వద్ద మాన వహారం నిర్వహించారు. అనంతరం బాపూజీ విగ్రహం వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేశారు. ఆ తర్వాత కస్పా హై స్కూల్లో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, చేతుల పరిశుభ్రత వంటి అంశాలపై వివరించారు. కణపాక ప్రాంతంలో అంటురోగాల ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వర్షాకాలంలో పరిసరాలను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండ పల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో రామకృష్ణకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జంషెడ్ పూర్ స్టేట్ నేషనల్ సీనియర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో విజయనగరానికి చెందిన శీల రామకృష్ణ గోల్డ్‌మెడల్ సాధించాడు. విజయనగరం జిల్లా పరిషత్ లో కంప్యూటర్ ఆపరటర్ గా పని చేస్తున్న రామకృష్ణ ఈ నెల 18 నుంచి 21 వరకు ఝార్ఖండ్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని 550 కేజీలు బరువు ఎత్తి గోల్డ్ మెడల్ సాధించాడు. గోల్డ్ మెడల్ సాధించడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిఇఒ బివి సత్యనారాయణను అభినందించారు.


రామకృష్ణను అభినందిస్తున్న జెడ్‌పి చైర్మన్

భావితరాలకు ఆదర్శం టంగుటూరి

ప్రజాశక్తి-విజయనగరంకోట


నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేసిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం భావి తరాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో టంగుటూరి 154 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ తదితరులు నివాళులర్పించారు. పేదరికంలో పుట్టి , పూట కూళ్ళ లో పని చేస్తూ ఉన్నత విద్యావంతునిగా , పత్రికా సంపాదకుని గా, ప్రజా నాయకునిగా , స్వాతంత్ర్య సమర యోధునిగా, ముఖ్యమంత్రిగా ఎదిగి, సంపాదించిన దానిని ప్రజలకే పంచి, పేదవానిగా మరణించిన మహా నీయుడని కొనియాడారు. ఆయన వితం అందరికీ ఆదర్శమని కలెక్టర్ పేర్కొన్నారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ సైమన్ గో బాక్ నినాదం తో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి గుండె చూపిన ధైర్యశాలి అని పేర్కొన్నారు. విద్యా పరంగా శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయాన్ని స్థాపించి విద్యా వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, కలెక్టరేట్ ఎఒ తాడ్డి గోవింద, సిపిఒ బాలాజీ, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, మార్క్‌ఫెడ్ డిఎం వెంకటేశ్వర రావు, అధికారులు పాల్గొన్నారు

టంగుటూరి జీవితం ఆదర్శప్రాయం : మేయర్

విజయనగరం టౌన్ : టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలు జరిగాయి. ఆంధ్ర కేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపు కోట : ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయిన టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కె వాసుదేవరావు ముందుగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర సమరంలో బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పట్టించిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గొప్ప యోధుడన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.సుధీర్, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ రాచర్ల శ్రీలక్ష్మి, పొలిటికల్ అధ్యాపకురాలు బి సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు వృత్తిలో సానుకూల దృక్పథం కీలకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోలీసులకు వృత్తిలో సానుకూల దృక్పథం కీలకమని ప్రముఖ సైకాలజిస్టు, సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ ఎఒ డాక్టర్ ఎన్.వి.ఎస్.సూర్యనారాయణ తెలిపారు. శనివారం పోలీస్ ట్రైనింగ్ కాలేజిలో వ్యక్తిత్వ వికాసంపై ట్రైనర్స్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యక్తిత్వ వికాసంలోని పలు అంశాలను వివరించారు. ముఖ్యంగా స్వీయ నియంత్రణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భావోద్వేగ ప్రజ్ఞ, సానుకూల దృక్పథం, నాయకత్వ లక్షణాలు, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలను ప్రాముఖ్యతతో వివరించారు. కార్యక్రమంలో పిటిసి అధికారులు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చిన్న గుడిపాల గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఇంఛార్జి ఎంపిడిఒ కె.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ భవనం నుండి రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఇంటింటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని దుకాణదారులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బహిరంగ మలవిసర్జన చేయకూడదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు, ఎంఇఒ బాల భాస్కరరావు, వెలుగు ఎపిఎం సూర్యనారాయణ, జిల్లా రిసోర్స్ పర్సన్ ఖాన్, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ గొర్లె రాంబాబు, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, కన్నం నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ లండ పెంటయ్య, మెడికల్ సిబ్బంది, క్లాప్ మిత్రాలు ప్రజలు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను పిఒ, అంగన్వాడీలు, సూపర్‌వైజర్లు తొలగించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ జాగాన విజయలక్ష్మి మాట్లాడుతూ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛ ఆంధ్రా నిర్వహించి పిచ్చిమొక్కలు తొలగించినట్లు చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

నెల్లిమర్ల: స్వర్ణంధ్ర- స్వచ్ఛంధ్ర ర్యాలీ శనివారం నగర పంచాయతీ కార్యాలయం నుండి రామతీర్థం జంక్షన్ వరకు నిర్వహించి వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలపై, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్‌పర్సన్ సముద్రపు రామారావు, నగర పంచాయతీ కమిషనర్ టి. జయరాం, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరం: స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గంగుచోళ్ళ పెంట, కొనిస గ్రామాల్లో ఇంచార్జ్ ఎంపిడిఒ పుష్ప ఆధ్వర్యంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై వీధుల్లో తిరుగుతూ అవగాహన కల్పించారు. మరుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ సెక్రెటరీకి సూచించారు. విద్యార్థుల చేత పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కవరపుకోట: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కోసం ఐక్యంగా ఉందామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండలంలోని గనివాడ గ్రామంలో స్వర్ణాంధ్ర 2047 సంకల్పం లో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ప్రతి రోజు పారిశుధ్యం మెరుగుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎల్‌కోట: సేకరించిన చెత్తను రిక్షాలో వేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

రాజాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జోరుగా కొనసాగుతోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండలంలోని పొగిరి పాఠశాల ఆవరణలో శనివారం ఆయన మొక్కలు నాటారు. జిల్లా పరిషత్ పాఠశాల వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల నుంచి పొగిరి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రజాప్రతినిధులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం రోడ్డుపై ఉన్న చెత్తా చెదారాన్ని ఊడ్చి,కాలువలలో మందును చల్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుమల వెంకట మన్మథరావు, గురవాణ నారాయణ రావు, వంగా వెంకటరావు, దుప్పల పూడి శ్రీను, లచ్చుభుక్త కృష్ణమూర్తి, సుమల జగన్ మోహన్, దాసరి మురళీ, కెల్ల వెంకట రమణ, జెవి రమణ, చిట్టి, మరిపి జగన్, ముగడ శ్రీను, జనసేన నాయకులు ఊర్లాపు పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.